# పాఠశాల నాయకులలో పరస్పర వ్యక్తిత్వ నైపుణ్యాలు

## (Interpersonal Skills in School Heads)

**రచయిత**

కె. ఆరాధన, ప్రధానోపాధ్యాయురాలు,

ప్ర.ఉ.పా. నెం.2, తాండూర్,

వికారాబాద్ జిల్లా.

**అనువాదం**

వి. నీరజ, ఎస్.జి.టి.,

ప్ర.ప్రా.పా., సెయింట్ పీటర్స్, కాచిగూడ,

హైదరాబాద్ జిల్లా.

**ఎడిటింగ్**

డా. ఎస్. సురేష్ బాబు, కన్సల్టెంట్, స్కూల్ లీడర్షిప్ అకాడమీ,

ఎస్.సి.ఇ.ఆర్.టి., తెలంగాణ, హైదరాబాద్.

**స్కూల్ లీడర్షిప్ అకాడమీ**
**ఎస్.సి.ఇ.ఆర్.టి., తెలంగాణ,**
**హైదరాబాద్.**

**నేషనల్ సెంటర్ ఫర్ స్కూల్ లీడర్షిప్,**
**ఎన్.ఐ.ఇ.పి.ఎ (NCSL-NIEPA),**
**న్యూఢిల్లీ.**

## పరిచయం

ప్రతి పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడు నాయకత్వం వహిస్తాడు. అతడు ఆ సంస్థను నిర్వహించడానికి మరియు ముందుకు నడిపించడానికి బాధ్యత వహిస్తాడు. సమర్థవంతమైన పరిపాలనకై పాఠశాల నాయకుడికి వివిధ నైపుణ్యాలు, సామర్థ్యాలు ఉండాలి. ఈ రోజు పాఠశాల ప్రధానోపాధ్యాయులను ఎన్నో సమస్యలుపీడిస్తున్నాయి. ఇవన్నీ కూడా 21వ శతాబ్దపు విద్యా అవసరాలను, డిమాండ్లను పరిష్కరించే దిశగానే ఉన్నాయి. పాఠశాల లక్ష్యాలను గుర్తించాలంటే నాయకులు స్పష్టమైన, సమర్థవంతమైన నాయకత్వం కలిగి ఉండాలి. పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను, ప్రత్యేకించి గుణాత్మక విద్యను పెంపొందించడంలో సమస్యలను పరిష్కరించే నాయకులను, సూపర్వైజర్లకు స్ఫూర్తినిచ్చి, విజయం కోసం సంసిద్ధులై ఉండడంలో మంచి నాయకత్వం పాఠశాలలను ప్రోత్సహిస్తుంది. పాఠశాల నాయకుడికి, ఒక నాయకుడిగా, నిర్వాహకుడిగా చక్కటి జ్ఞానం, నైపుణ్యాలు, సురక్షితమైన, సమర్థవంతమైన, ప్రయోజనకరమైన అభ్యసన వాతావరణాన్ని పెంపొందించే యోగ్యత కలిగి ఉండవలసిన అవసరం ఉంది. అంతేగాక ప్రత్యేక అవసరాలు, అభ్యసనా లోపాలు ఉన్న పిల్లలను సాధారణ పిల్లలతో కలిపి ఒకే కప్పుకింద సమ్మిళిత విద్యను అందించాలి. ఏ రంగంలోనైనా పిల్లలకున్న బలాలు, బలహీనతలకు అతీతంగా వారిని ఒకే తరగతిగదిలో చేర్చి వారికున్న సామర్థ్యాలను గరిష్ఠస్థాయికి తీసుకురావాలి.

ఇవన్నీ సాధించడంలో పరస్పర వ్యక్తిత్వ నైపుణ్యాలు (interpersonal skills) ముఖ్య భూమిక పోషిస్తాయి. సిబ్బంది, తల్లిదండ్రులను, SMC సమాజంలాంటి ముఖ్యమైన భాగస్వామ్యుల చుట్టూ నాయకుని వైఖరి అల్లుకుని ఉంటుంది.

పాఠశాల పరిపాలనాధికారి తన ప్రవర్తనతో పాటు విద్యార్థుల, ఉపాధ్యాయుల, ఇతర సిబ్బంది, తల్లిదండ్రుల విద్యా పరమైన విధానాలు ఏదో రకంగా ప్రభావితం చేసే సమాజంలోని అందరి పౌరుల ప్రవర్తనను అర్థం చేసుకోవాలి. నాయకులు పాఠశాల యాజమాన్యాలు, పాఠశాల సంబంధిత సంస్థలు, పాఠశాల సిబ్బంది సమూహాలనే కాకుండా పాఠశాలల పనిని, బలాన్ని, గుణాత్మకతను ప్రభావితం చేయగల సమాజంలోని ఇతర సమూహాల క్రియాశీలతను అర్థం చేసుకోవాలి. ఒక వ్యాపారం లేదా పరిశ్రమ ఎగ్జిక్యూటివ్ లా కాకుండా పాఠశాల పరిపాలనాధికారి తన ఉన్నతాధికారులకు, పాఠశాల నియంత్రణ బోర్డుకు మాత్రమే కాక సమాజానికి కూడా జవాబుదారీగా ఉండాలి. అందుకే వ్యక్తిగత, సమూహాల ప్రవర్తనలపై అతని దృష్టి కోణం విశాలంగా ఉండాలి.

పాఠశాల పరిపాలనలో పరస్పర వ్యక్తిత్వ సంబంధాలు ఎంతో ముఖ్యం. ఎందుకంటే పరిపాలనాధికారి ప్రాథమిక బాధ్యత మన పిల్లల చదువు విద్య కోసం అవసరమైన వస్తు, మానవ వనరులను సమకూర్చి నిర్వహించడమే. ఈ మిషన్లో సమర్థవంతంగా ఉండాలంటే అతను / ఆమె ప్రజలతో కలిసి పనిచేసే నైపుణ్యం కలిగి ఉండాలి. సిబ్బందికి, పరిపాలనాధికారులకు మధ్య వచ్చే గొడవల్లో ఈ మిషన్ రూపురేఖలు మారిపోతుంటాయి. చివరకు ఏ పిల్లలకు సహాయం చేయాలని ఇదంతా చేస్తున్నామో ఆ పిల్లలకే నష్టం వాటిల్లుతుంది.

## పాఠశాల నిర్దేశిత లక్ష్యాన్ని సాధించడంలో పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలు ఎలా తోడ్పడతాయి?

మన వృత్తిలో ఇతరులతో సమర్థవంతంగా మాట్లాడడానికి పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలు తోడ్పడతాయి. చక్కటి పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలు కలిగిన పాఠశాల నాయకులు చక్కటి సామాజిక సంబంధాలను నెలకొలుపుతారు. పిల్లలతో, తల్లిదండ్రులతో సమాజంలోని పెద్దవారితో వీరు మాట్లాడడం వల్ల పాఠశాలలో డ్రాపౌట్ రేట్ తగ్గి నమోదు మెరుగువుతుంది. అలా వీరి నైపుణ్యం వల్ల పాఠశాలకు లాభం చేకూరుతుంది. పాఠశాల నాయకులు సమర్థవంతమైన బోధనాభ్యసన ప్రక్రియలను అమలు చేయడం వల్ల గుణాత్మకత పెరుగుతుంది. తద్వారా విద్యావిషయక అంశాలు, మానసిక స్థిరత్వం, సామాజిక సమర్థత మెరుగుపడతాయి. పాఠశాల నాయకుడు సామాజికంగా బాధ్యత వహిస్తాడు. ప్రతి పౌరునికి విద్యనందించే విద్యాహక్కును దృష్టిలో పెట్టుకుని పిల్లల విద్యావసరాలను డిమాండ్లను తీర్చే దిశలో పనిచేస్తాడు.

పాఠశాల పరిపాలనను ప్రభావితం చేయగల తల్లిదండ్రులు, సమాజం, మీడియాను సమర్థవంతమైన భాగస్వాములను చేయడం కోసం వస్తు, మానవ వనరులను సమకూర్చే, నిర్వహించే బాధ్యత తీసుకుంటాడు. సాంస్కృతిక నైపుణ్యాలు కలిగిన పాఠశాల నాయకులు సాంస్కృతిక సమూహాలలోని వైవిధ్యాన్ని గుర్తించి, ఇతరులతో అవగాహనను పెంచి, ఇతర సంస్కృతులను ప్రశంసించేలా చేస్తారు. ఇలా చేయడంలో బడిబయట, బడి లోపలున్న ఎంతో మంది భాగస్వామ్యుల అవసరాలను డిమాండ్లను పాఠశాల నాయకుడు తీరుస్తాడు.

# యూనిట్-1: పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలంటే ఏమిటి?

**అభ్యసన లక్ష్యం**

పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలంటే ఏమిటి? అవి ఎన్ని రూపాలలో ఉంటాయి అని అభ్యాసకులు అర్థం చేసుకుంటారు.

**కీలక పదాలు**


మౌఖిక పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలు, అమౌఖిక పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలు, లిఖిత పరస్పర వ్యక్తిత్వ నైపుణ్యాలు.

**పరిచయం:**

పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలంటే ఇతరులతో మాట్లాడుతున్నప్పుడు మనం ప్రదర్శించే పైఖరులు, అలవాట్లు. పని వాతావరణంలో ప్రభావవంతమైన పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలు విజయానికి కీలకమైన సూచికలు. అందులో భావప్రసార, సామాజిక నైపుణ్యాలు, జట్టుకృషి, సమస్యా పరిష్కారం, వృత్తి నైపుణ్యం ఉంటాయి. ఇంకోవైపు ఇవి లేకపోతే పని జరగడంతో అడ్డంకి ఏర్పడవచ్చు.

మౌఖిక, అమౌఖిక, లిఖిత లాంటి వివిధ రూపాలలో పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలు ఉండవచ్చు.

- ఆన్లైన్లో లేదా ముఖాముఖితో నేరుగా మట్లాడడం లాంటివి మౌఖిక పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలలో ఉంటాయి. ఉదా: ఆన్లైన్లో జూమ్ మీటింగులు నిర్వహించడం, ముఖాముఖి చర్చలు, కాన్ఫరెన్స్ లు నిర్వహించడం, స్వరస్థాయి, పదాల ఎంపిక సందేశాన్ని అందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి.
- లిఖిత పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలలో అధికారిక/ అనధికారిక ఉత్తరాలు రాయడం, రాత లేదా పట్టిక రూపంలో ఫీడ్ బ్యాక్ లు, సమీక్షలు, నివేదికలు రాయడం లాంటివి ఉంటాయి. సందేశాలు సాధారణంగా స్పష్టంగా సంక్షిప్తంగా ఉంటాయి.
- అమౌఖిక పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలలో మన భావోద్వేగం మన ముఖకవళికల ద్వారా తెలియజేయాలి. ఇది ఇతరులతో మాట్లాడే ఒక సున్నితమైన పద్ధతి. శారీరక హావభావాలు (బాడీ లాంగ్వేజ్) ముఖ్య పాత్ర పోషిస్తాయి.



## సారాంశం

మనం ఎంత నేర్చుకున్నామో కింది ప్రశ్నావళి ద్వారా పరీక్షించుకుందాం.

1. ఒక పాఠశాలను సమర్థవంతంగా నడపాలంటే ఆ పాఠశాల నాయకుడికి ఏ పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలు ఉండాలి?

2. పాఠశాల లోపల పాఠశాల నాయకుడికి ఏ పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలు అవసరం?

3. ఒక జట్టులో పనిచేసేటప్పుడు పాఠశాల నాయకుడికి ఏ పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలు అవసరం?

4. బయటి సమాజం లేదా మీడియాతో మాట్లాడేటప్పుడు పాఠశాల నాయకుడికి ఏ పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలు అవసరం?

5. పాఠశాల నాయకుడికి సాంస్కృతిక నైపుణ్యాలు అవసరమని మీరనుకుంటున్నారా? అయితే ఒకటి లేదా రెండు ఉదాహరణలివ్వండి.

6. పాఠశాల పరిపాలనా ఫలితాన్ని పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలు ప్రభావితం చేస్తాయని మీరనుకుంటున్నారా?

# యూనిట్-2: పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాల స్థాయిలు

## అభ్యసన లక్ష్యం


అభ్యాసకులు వివిధ స్థాయిల మానవ సంబంధాల గురించి అర్థం చేసుకుంటారు. సామాజిక సంబంధాలలో పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలు ఎలా ఇమిడి ఉన్నాయో శోధిస్తారు.

## కీలకపదాలు

పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలు/వ్యక్తింతర నైపుణ్యాలు (intrapersonal skills)/ జట్టు / బృందం, ప్రజలు / మరియు సాంస్కృతిక నైపుణ్యాలు, ప్రవర్తన, మునుపటి స్థితికి రావడం.

## పరిచయం

వివిధ భాగస్వామ్యులతో మాట్లాడుతుంటారు కాబట్టి పాఠశాల నాయకులు పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాల విభిన్న కోణాలను ప్రదర్శించవలసిన అవసరం ఉంది. కింది చిత్రాలలో చూపినట్టుగా వారు ఎవరితో మాట్లాడుతున్నారు అనే దాన్ని బట్టి ఎన్నో స్థాయిల్లో వారి పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలను ప్రదర్శించవలసి ఉంటుంది.




తనలోని అంతర్గత సామర్థ్యాలు, ప్రవర్తన తన భావోద్వేగాలను నిర్వహణ (manage) చేయడంలో సాయం చేస్తూ తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అవి ఏవిధంగా ప్రభావితం చేయగలవు అన్న అవగాహన పెంచడంతో ఒక వ్యక్తిలో పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలు మొదలవుతాయి. ఇవి ఒక వ్యక్తిలోపల ఇమిడి ఉంటాయి. వాటిని వ్యక్తింతర (తమతో తాము) నైపుణ్యాలని (intrapersonal skills) అంటారు. ఆ తరువాత స్థాయిలో ప్రతిఒక్కరితో ప్రత్యేక సంబంధాలు కలిగి, ప్రతి ఒక్కరి సమస్యపై వ్యక్తిగత శ్రద్ధపెట్టవలసిన అవసరం ఉంటుంది. వీటిని పరస్పర వ్యక్తిత్వ (వ్యక్తిగత వ్యక్తులతో) నైపుణ్యాలను (inter-personalskills) అంటారు. జట్టు / బృందంతో మాట్లాడేటప్పుడు నిర్ణయం తీసుకోవడం, చర్చలు జరపడం, గొడవలకు పరిష్కారం చూపడం లాంటి పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలు ప్రదర్శించాలి. తరువాత స్థాయిలో పబ్లిక్ / మీడియా ముందు మాట్లాడేటప్పుడు సున్నితంగా, సమాజంలోని సెంటిమెంట్లను గౌరవిస్తూ మాట్లాడాలి. గౌరవనీయంగా

మాట్లాడడం, పరిపుష్ఠిని (feedback) స్వీకరించడం ఈ స్థాయిలోని కొన్ని నైపుణ్యాలు. చివరగా బహుళ సాంస్కృతిక సామర్థ్యాలు సాధించడం, వివిధ సాంస్కృతిక సమూహాల వైవిధ్యాన్ని గుర్తించడం అనేవి అంతర్ సాంస్కృతిక నైపుణ్యాల కింద వస్తాయి.

| క్ర. సం. | నైపుణ్యాలు ప్రదర్శించే చోటు | నిర్వచన పరిధి |
|---|---|---|
| 1 | వ్యక్తింతర నైపుణ్యాలు (Intrapersonal skills) తమతోతాము | పాఠశాలను సమర్థవంతంగా నడపడానికి, పాఠశాల నాయకుడు ప్రదర్శించే స్వీయ నైపుణ్యాలు / అంతర్గత సామర్థ్యాలు, ఆత్మవిశ్వాసం, పట్టుదల, సమయాన్ని మేనేజ్ చేయడం, భావోద్వేగ స్థిరత్వం, దృఢత్వం (resilience), అనుకూలత, పనిలో పాటించే మర్యాద, నీతి |
| 2 | పరస్పర వ్యక్తిత్వ నైపుణ్యాలు (Interpersonal skills) వ్యక్తులు పరస్పరంగా | ఒక్కొక్కరితో మాట్లాడడం ఇందులో ముఖ్యమైంది. ప్రతి ఒక్కరితో చక్కటి వ్యక్తిత్వాన్ని ప్రదర్శించడం అవసరం. అందరితో సహానుభూతిగా ఉంటూ వారి సమస్యలను వినాలి. |
| 3 | జట్టు / సమూహం నైపుణ్యాలు | సంఘర్షణ నివారణ, సమస్యా పరిష్కారం, నిర్ణయం తీసుకోవడం విధులు నిర్దేశించడం, ఖచ్చితంగా ఉండడం, పర్యవేక్షించడం, చర్చలు జరపడం లాంటి నైపుణ్యాలను ప్రదర్శిస్తూ బోధనా, బోధనేతర సిబ్బంది లేదా SMC సభ్యులతో ఒక జట్టు / బృందంలో పని చేయగలగడం. |
| 4 | పబ్లిక్ / మీడియా నైపుణ్యాలు | సమాజం / మీడియాతో పాఠశాల నాయకుడికుండే సంబంధాలు, సమాజంలోని భావాల (sentiments) పట్ల పాఠశాల నాయకుడు సున్నితత్వంతో గౌరవభావంతో ఉండాలి. బహిరంగంగా మాట్లాడడం, ఓపికగా ఫీడ్ బ్యాక్ ను స్వీకరించడం, గౌరవంగా ఉండడం, సానుకూల దృష్టి కలిగి ఉండడం లాంటి నైపుణ్యాలను ఇక్కడ ప్రదర్శిస్తారు. |
| 5 | అంతర్ సాంస్కృతిక నైపుణ్యాలు | పాఠశాల నాయకులు బహుళ సాంస్కృతిక సామర్థ్యాలను సాధించాలి. ఇతర సంస్కృతుల ఆచారాల పట్ల అనుకూలంగా, స్వాగతించేలా ఉండాలి.వివిధ సాంస్కృతిక సమూహాలలో వైవిధ్యాన్ని గుర్తించాలి. |

వివిధ పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలున్న పాఠశాల నాయకులు ఎన్నో సవాళ్ళను ఎలా ఎదుర్కొన్నారో అర్థం చేసుకోవడానికి ఒక కేస్టడీ ని చూద్దాం . ఈ పాఠశాల నాయకులు బడి బయట, బడి లోపల వివిధ వ్యక్తులతో పనిచేసేటప్పుడు బహుళ వ్యక్తిగత నైపుణ్యాలు ప్రదర్శించారు.

**కేస్ స్టడీ:**

వికారాబాద్ జిల్లాలో తాండూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెం.2 ఉర్దూ మీడియం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి కె. ఆరాధన (FAC), తన లక్ష్యాలను సాధించడాన్ని అడ్డుకుంటున్న అనేక కీలక కారణాలను గుర్తించారు. అన్నింటికంటే ముఖ్యకారణం పిల్లలు బడికి క్రమం తప్పకుండా రాకపోవడమని తెలుసుకున్నారు. చాలామంది విద్యార్థులు క్లాసులు ఎగ్గొట్టి ఆటస్థలాలకు, బావులు, చెరువులు లాంటి స్థలాలకు వెళుతున్నారని గమనించారు. ముందుగా అసెంబ్లీలో విద్యార్థులందరూ బడికి రోజూ రావాలని, క్లాసులు ఎగ్గొట్టద్దని కోరారు. ఆ తరువాత మధ్యాహ్నం సెషన్లో హాజరు తీసుకోవడం ప్రారంభించారు. కానీ ఆశించిన విధంగా విద్యార్థుల హాజరు పెరగలేదు. పాఠశాల, సమాజ ప్రయోజనాలకై ప్రధానోపాధ్యాయురాలు బాధ్యతాయుతంగా వ్యవహరించారు. సిబ్బందితో ఒక సమావేశం ఏర్పాటుచేసి, సమస్య తీవ్రతను వివరించారు. వారి అభిప్రాయాలను తీసుకొని ఒక ప్రణాళిక రూపొందించారు. సిబ్బందికి పనులను అప్పగించారు.

క్లాస్ టీచర్లు తమ తరగతుల్లో లేని పిల్లల్ని గుర్తించి, వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి విషయం తెలియజేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయురాలుతో పాటు ఒకరిద్దరు సిబ్బంది పిల్లల ఇంటికి, బావుల దగ్గరకు, ఆటస్థలాలకు వెళ్ళి పిల్లలను బడికి తెచ్చే ప్రయత్నం చేశారు. క్రమం తప్పకుండా బడికి హాజరయ్యేలా పిల్లలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. హెచ్.ఎం. ఇంకో అడుగు ముందుకేసి తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. టీచర్లు, ప్రధానోపాధ్యాయురాలు తీసుకున్న చొరవను ప్రశంసించారు. దీంతో తల్లిదండ్రులు మరింత బాధ్యతాయుతంగా పిల్లలను క్రమం తప్పకుండా బడికి పంపడమే కాక అప్పుడప్పుడు వారెక్కడ ఉన్నది కనుక్కున్నారు.

## సారాంశం

ప్రధానోపాధ్యాయురాలు సమస్యను ఎలా గుర్తించింది, పరిస్థితిని ఎలా ఎదుర్కొన్నది, పిల్లలను తిరిగి బడికి రప్పించడానికి ఎటువంటి చర్యలు తీసుకుంది అనే విషయాలను సారాంశ రూపంలో ఇప్పుడు చూద్దాం. పాఠశాల నాయకురాలు చూపించిన వివిధ వ్యక్తిగత నైపుణ్యాలను ఒక పట్టికలో పొందుపరుద్దాం.

పై కేస్ స్టడీలో పాఠశాల నాయకురాలు చూపించిన వ్యక్తిగత నైపుణ్యాలు

| క్ర.సం. | నైపుణ్యం | లక్షణం | చేసిన పనిలో ఇమిడివున్న నైపుణ్యం |
|---|---|---|---|
| 1 | వ్యక్తింతర నైపుణ్యాలు | ఆత్మవిశ్వాసం దృఢత్వం | పాఠశాల లక్ష్యాన్ని సాధిస్తానని నమ్మకంగా ఉంది. మొదట్లో పిల్లల హాజరును నియంత్రించలేకపోయినా, సమస్యను పరిష్కరించడానికి ఎన్నో చర్యలు తీసుకుంది. |

| క్ర.సం. | నైపుణ్యం | లక్షణం | చేసిన పనిలో ఇమిడివున్న నైపుణ్యం |
|---|---|---|---|
| | | అనుకూల్యత సామర్థ్యం | పరిస్థితికి తగినట్టుగా ఇతర టీచర్లతో కలిసి, పిల్లలను బడికి రప్పించడానికి చెరువుల, బావుల వద్దకు వెళ్ళింది. |
| 2 | ఇంటర్ పర్సనల్ వ్యక్తిగత స్ఫూర్తి నైపుణ్యాలు | స్ఫూర్తి | ప్రధానోపాధ్యాయుల యొక్క స్ఫూర్తి క్రింది ఫలితాలలో ప్రతిబింబించింది.<br>1. పిల్లలను బడికి తిరిగి రప్పించడంతో సమిష్టిగా పనిచేసేలా టీచర్లకు<br>2. విద్య ప్రాముఖ్యతను గుర్తింప చేయడంలో తలిదండ్రులకు<br>3. రెండు సెషన్లలో విద్యార్థులు బడిలో ఉండడం |
| 3 | జట్టు పని | భావప్రసారం | సమస్యను గమనించిన తరువాత దానిని టీచర్లకు తల్లిదండ్రులకు, సమాజ సభ్యులకు తెలియజేసింది. |
| | | విధులను అప్పగించడం | 1. తరగతికి రాని పిల్లలను గుర్తించడం<br>2. తల్లిదండ్రులకు ఫోన్ చేయడం<br>3. ఒకరిద్దరు టీచర్లను బావి వద్దకు పంపించడం లాంటి విధులను సిబ్బంది అప్పగించింది. |
| | | జట్టులో ఒక సభ్యురాలిగా పనిచేయడం | మిగతా టీచర్లతో కలిసి పిల్లల ఇళ్ళను సందర్శించింది. |
| | | నిర్ణయం తీసుకోవడం | పిల్లల ఇళ్ళకు, ఆటస్థలాలకు వెళ్ళిరావడం తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశాలను తరుచుగా నిర్వహించడం లాంటి నిర్ణయాలు తీసుకుంది. |
| 4 | పబ్లిక్ | సామాజిక బాధ్యత తీసుకోవడం | విద్యాహక్కు ప్రాముఖ్యతను గుర్తించి పిల్లలందరికీ ప్రయోజనం కలుగజేసింది. |
| | | ప్రజలతో మాట్లాడడం | పాఠశాల లక్ష్యాన్ని తల్లిదండ్రులకు సమాజ పెద్దలకు వివరించింది. |
| | | సానుకూల దృష్టి ఉండడం | ఒక ఆశావాదిగా సానుకూలంగా ఉండడం. |
| 5 | సాంస్కృతిక | భిన్న సామాజిక వర్గాలు ఉన్నప్పటికీ అందరితో కలిసి చేయడం | సమాజం మొత్తం లాభపడాలనే ఉద్దేశంతో ఎటువంటి అరమరికలు లేకుండా వ్యవహరించింది. |

# యూనిట్-3

## బహుళ భాగస్వామ్యుల పట్ల పాఠశాల నాయకుల పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలు

### అభ్యసన లక్ష్యం


బడి లోపల, బడి బయట ఉన్న ఎంతో మంది భాగస్వామ్యుల పట్ల పాఠశాల నాయకులు ఎటువంటి వ్యక్తిగత నైపుణ్యాలు ప్రదర్శిస్తారో అభ్యాసకులు అర్థం చేసుకుంటారు.

### కీలక పదాలు

భాగస్వామ్యులు, విద్యార్థి కేంద్రీకృత, పాఠశాల కేంద్రీకృత, కౌమారులు, పాఠశాల నిర్వహణ కమిటీ (SMC), సమాజం, మీడియా.

### పరిచయం

చక్కటి పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలున్న పాఠశాల నాయకులు, విద్యావ్యవస్థలోని అందరు భాగస్వామ్యులతో ఉన్నత స్థాయిలో మంచి సామాజిక సంబంధాలు కలిగి ఉంటారు. దీనివల్ల సమర్థవంతమైన పాఠశాల పరిపాలనలో మానవసంబంధాల పరిధి యొక్క స్థితి తెలుస్తుంది. అంతేకాక వివిధ పరిపాలనా పరిస్థితులలో ఏ రకమైన సంబంధాల మెళకువలను అమలు చేయాలో శోధించేలా సాయపడుతుంది. ఎంతో మంది భాగస్వామ్యులతో పాఠశాల నాయకులు ఏ రకమైన సామాజిక సంబంధాలు కలిగి ఉంటారో కింది చిత్రం ద్వారా తెలుస్తుంది.




బహుళ వాటాదారులతో మాట్లాడేటప్పుడు, పాఠశాల నాయకుల పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలను ప్రాథమికంగా రెండు రకాలుగా విభజించవచ్చు: బడిలోపల, బడి బయట. బడిలోపలి సంబంధాలను విద్యార్థులతో, సిబ్బందితో, పాఠశాల యాజమాన్య కమిటీతో, ఉన్నతాధికారులతో అని వర్గీకరించవచ్చు. సమర్థవంతమైన పరిపాలన కొనసాగించేందుకు పాఠశాల నాయకుడు బడిలోని వివిధ వ్యక్తులతో పనిచేయాలి. విద్యావిధానాలను సరిగ్గా అమలుచేసేందుకు పాఠశాల నాయకుడు అందరు భాగస్వామ్యులతో చక్కటి సంబంధాలు కలిగి ఉండాలి. ఈ విద్యావిధానాల అమలే పాఠశాల నాయకుల ముఖ్య పాత్ర మరియు బాధ్యత.

## ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో సంబంధాలు పెంపొందించడానికి పాఠశాల నాయకుల చర్యలు

పిల్లల విద్యకు పునాది ప్రాథమిక పాఠశాల. వీరి ప్రగతిలో ప్రాథమిక పాఠశాల అనుభవాలు ఎంతో కీలకం. అంతేకాక ఈ అనుభవాలు వారి విద్యావిషయక, సామాజిక, భౌతిక, భావోద్వేగ వృద్ధిని నిర్దేశిస్తాయి. వారు ఎదుర్కొనే కొన్ని సవాళ్లు

- ఇంటిని, పరిచయస్థులను వదిలి పాఠశాలకు రావడం.
- తమ పనులు తాము చేసుకోవడం – స్వతంత్రంగా ఉండడం.
- కొత్త పిల్లలను, పెద్దలను కలవడం.
- కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడం, పోటీపడడం.
- బడికి వెళ్ళాలంటే విముఖత చూపడం.
- అపరిచిత ప్రదేశంలో సర్దుబాటు చేసుకోవడం.

## పాఠశాల నాయకుని పాత్ర

పిల్లలు బడిని ఇంటిగా భావించగల సురక్షిత వాతావరణాన్ని సృష్టించడం పాఠశాల నాయకుని బాధ్యత. పాఠశాల నాయకుడు ప్రతి ఒక్కరిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. వారి అవసరాలు అర్థం చేసుకుని తీర్చాలి.

## కౌమారులు, ఉన్నత పాఠశాల పిల్లలతో సంబంధాలు పెంపొందించడానికి పాఠశాల నాయకుల చర్యలు

ఉన్నత పాఠశాల విద్యార్థులు తమలో ఎన్నో మార్పులు గమనిస్తారు. జీవితంలో అతి ముఖ్యమైన ఈ దశలో వారి శరీరంలో వచ్చే మార్పుల పట్ల స్పృహ వల్ల వారికి నిరంతర మద్దతు అవసరం. వారు ఎదుర్కొనే సమస్యలు.

- వారి శరీరంలో భౌతిక మార్పులు
- భావోద్వేగ మార్పులు – ఒత్తిడి
- ప్రవర్తనా మార్పులు
- మాదకద్రవ్యాల వాడకం
- విద్యాపరమైన సమస్యలు
- సామాజిక అంశాలు – డేటింగ్, సంబంధాలు
- సహచర ఒత్తిడి – బెదిరింపులు

## పాఠశాల నాయకుని పాత్ర

కౌమారులు మానసిక స్థితి, వారి ప్రత్యేక అవసరాలపై పాఠశాల నాయకుడికి సరైన అవగాహన ఉండాలి. అందువల్ల పరిస్థితులకు తగినట్టుగా ప్రవర్తించగలుగుతారు. సెక్స్ విద్యనందించడం, కౌమారులతో సరిగ్గా ప్రవర్తించడం, విలువలు, నైతిక విద్యనందించడం, వారి బలాల గురించి వారికి తెలియజేసి వాటికి తగిన వృత్తిని ఎంచుకునేలా చేయడం, వీటన్నింటినితమ యుక్త వయస్సులో కూడా పాటించేలా సామాజిక సమర్థత కలిగిన, చక్కటి పౌరులుగా యువతరాన్ని ఎదగనివ్వడం లాంటి పనులు పాఠశాల నాయకులు చేపట్టాలి.

## ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలతో సంబంధాలు పెంపొందించడానికి పాఠశాల నాయకుల చర్యలు

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల్లో అభివృద్ధి కుంటుపడడం, వైద్యపరమైన సమస్యలుండవచ్చు. వారి సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలి. దురదృష్టం ఏమిటంటే పిల్లల పట్ల సాధారణ నిర్లక్ష్య ధోరణి కలిసి సహానుభూతి, దయ, శ్రద్ధ లోపించడం జరుగుతుంది. అందుకే వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ, స్వీకరింపు చూపాలి.

## పాఠశాల నాయకుని పాత్ర

వీరికి అనువైన వాతావరణం సృష్టించడంలో సౌకర్యాలను అందించడంలో పాఠశాల నాయకుడు ప్రముఖపాత్ర నెరపాలి. వారి వైకల్యాలను, వాటి లక్షణాలను సహజమైనవిగా చూడాలి. పిల్లలు ఏం చేయలేరు అన్న దానిపై కాకుండా ఏం చేయగలరు అన్న దానిపై దృష్టిని కేంద్రీకరించాలి. వారి బలాలను గుర్తించాలి. వారి పోరాటాన్ని ఓపికతో అర్థం చేసుకోవాలి. స్వతంత్రతను, నిర్ణయాలు తీసుకోవడాన్ని ప్రోత్సహించాలి.

## బోధన, బోధనేతర సిబ్బందితో సంబంధాలు పెంపొందించడానికి పాఠశాల నాయకుల చర్యలు

పాఠశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది ఎదుర్కొనే సమస్యలు వేరుగా ఉంటాయి.

- రోజువారీ షెడ్యూళ్ళలో నుండి చాలా సమయం పేపర్ వర్కుకు కేటాయించడం జరుగుతుంది. ఇది వారి పనితీరును తీవ్రంగా ప్రభావితంచేస్తుంది.
- విద్యార్థుల ఫలితాలకు వారిని జవాబుదారులను చేసే పని తీరు ఒత్తిడి.
- విద్యార్థుల విభిన్న అభ్యసన అవసరాలను తీర్చడంలో సమతుల్యత పాటించడం.
- మౌలిక సదుపాయాలు సరిగ్గా లేని తరగతి గదుల్లో బోధించడం .
- విద్యావిధానంలో వచ్చే సరికొత్త మార్పులకు అనుగుణంగా - మారడం.
- స్ఫూర్తి, మద్దతు లేకపోవడం.

## పాఠశాల నాయకుని పాత్ర

బోధనా, బోధనేతర సిబ్బందికి విధులు అప్పగించి వారిని పనులలో నిమగ్నం చేయడం పాఠశాల నాయకుని బాధ్యత. అనుకూలమైన, ఒత్తిడి లేని వాతావరణాన్ని అతను సృష్టించాలి. వృత్తిపరంగా మారుతున్న డిమాండ్లకు అనుగుణంగా కొత్త విషయాలు నేర్చుకునేలా సిబ్బందిని ప్రేరేపించాలి. లక్ష్యాన్ని సాధించడానికి మార్గదర్శనం, నిష్పక్షపాత ఫీడ్బ్యాక్ ఇవ్వాలి. జట్టులో భాగంగా ఉంటూనే వారు సాధించిన గుణాత్మక, పరిమాణాత్మక విషయాలను పర్యవేక్షించాలి.

## పాఠశాల యాజమాన్య కమిటీలతో సంబంధాలు పెంపొందించడానికి పాఠశాల నాయకుల చర్యలు

పాఠశాల యాజమాన్య కమిటీ కనీసం రెండు నెలలకొకసారి సమావేశమై పాఠశాలలో ఉన్న సమస్యలకు పరిష్కార దిశగా చర్చించాలి. సమావేశాలతో జరిగిన చర్చలను / అంశాలను భాగస్వామ్యులకు అందుబాటులో ఉంచాలి.

## పాఠశాల నాయకుని పాత్ర

పాఠశాల నాయకులు పిల్లలు తల్లిదండ్రులతో సంరక్షకులతో క్రమం తప్పకుండా సమావేశమై పాఠశాలలోని సమస్యలను చర్చించాలి. ఎస్.ఎం.సి. సౌజన్యంతో పాఠశాల నాయుకుడు పాఠశాల అభివృద్ధి ప్రణాళిక రచిస్తాడు. ప్రభుత్వం నుండి వచ్చిన నిధులను ఏ విధంగా ఉపయోగించాలో కమిటీ తీర్మానం చేస్తుంది. పాఠశాల అభివృద్ధి కోసం ఎస్.ఎమ్.సి. ని పాఠశాల చురుకుగా వినియోగించాలి.

## ఉన్నతాధికారులతో సంబంధాలను పెంపొందించడానికి పాఠశాల నాయకుల చర్యలు

పాఠశాల ఎంత సమర్థవంతంగా పని చేస్తుందో పర్యవేక్షించడానికి కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు MEO, Dy.EO, DEO లాంటి అధికారులు పాఠశాలను సందర్శిస్తారు. వారి సందర్శనా సమయంలో మధ్యాహ్న భోజన పథకం మొదలుకొని పాఠ్యప్రణాళిక బోధన వరకు అన్నీ చూస్తారు. ఏవైనా వ్యత్యాసాలుంటే అవసరమైన ఫీడ్బ్యాక్ ఇస్తారు.

## పాఠశాల నాయకుని పాత్ర

ఉన్నతాధికారులు అడిగిన బిల్లులు చూపించడం పాఠశాల నాయకుని బాధ్యత. అధికారుల ఇచ్చిన ఫీడ్ బ్యాక్ ను స్వాగతించాలి. ఎక్కడైనా లోపాలుంటే అంగీకరించాలి. మెరుగుదల అవసరమైన అంశాలలో సిబ్బంది సహకారంతో పనిచేయాలి.

## తల్లిదండ్రులు/ సమాజంలో సంబంధాలు పెంపొందించడానికి పాఠశాల నాయకుల చర్యలు

పిల్లల అభివృద్ధి అవసరాలను కేవలం పాఠశాలలు మాత్రమే తీర్చలేవు. తల్లిదండ్రుల అర్థవంతమైన మద్దతు కూడా అవసరం. పాఠశాల కృత్యాలలో పాల్గొనడం వలన తల్లిదండ్రులకు పాఠశాలకు సంబంధించిన వృత్తిపరమైన అంశాలు తెలుస్తాయి. అలాగే పాఠశాల పనిచేసే తీరు, పాఠ్యప్రణాళిక, బోధన గురించి కూడా తెలుసుకుంటారు. తల్లిదండ్రులు పాఠశాల నడుమ ఈ బలమైన భాగస్వామ్యం పాఠశాల లక్ష్యాన్ని సాధించడానికి దోహదపడుతుంది.

## పాఠశాల నాయకుని పాత్ర

తల్లిదండ్రుల తమ అభిప్రాయాలను మరియు పరిపుష్టిని (feedback) పంచుకోవడానికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడం. తల్లిదండ్రుల మధ్య విశ్వాసాన్ని పెంపొందించడానికి మరియు పాఠశాల సంబంధిత కార్యకలాపాలలో వారిని నిమగ్నం చేయడానికి కృషి చేయడం.

## మీడియా / స్థానిక నాయకులతో పాఠశాల నాయకుని సంబంధం

పాఠశాల కృత్యాలకు సంబంధించి అంతర్గత, బాహ్య సంస్థలతో విజయవంతమైన భాగస్వామ్యం కోసం పాఠశాల నాయకులు మీడియా, స్థానిక నాయకులతో సత్సంబంధాలు కలిగి ఉండడం ఎంతో ముఖ్యం.

## పాఠశాల నాయకుని పాత్ర

సమాజ నిర్మాణ ప్రాముఖ్యత, పాఠశాల నాయకుడితో ముడిపడి ఉంటుంది. కింది విధాలుగా పాఠశాల నాయకుడు మీడియాతో స్థానిక నాయకులతో సంబంధాలు కలిగి ఉండాలి

- మీడియా ద్వారా పాఠశాల విజయాలను ప్రసారం చేయడానికి, ప్రచురించడానికి
- పాఠశాల అవసరాలను, సమస్యలను స్థానిక నాయకుల వద్ద ప్రస్తావించి సమాజ భాగస్వామ్యాన్ని పెంచడం కోసం
- పాఠశాల అవసరాలను తీర్చి, దాని సంక్షేమానికి అభివృద్ధికి పాటుపడడం.

పాఠశాల పనితీరును, పరిపాలనను ప్రభావితం చేయగల తల్లిదండ్రులు, సమాజ పెద్దలు, ఇతర పౌరులతో పాశాల నాయకుడు పరస్పర వ్యక్తిత్వసత్సంబంధాలు కలిగి ఉండాలని, బహు పాత్రలు పోషించాలని పైవాటి ఆధారంగా చెప్పవచ్చు. ప్రతి పౌరునికి విద్యాహక్కును దృష్టిలో పెట్టుకుని పాఠశాల నాయకుడు పిల్లల విద్యా అవసరాలను, డిమాండ్లను తీర్చడానికి నిరంతరం కృషి చేయాలి. పాఠశాల పరిపాలనను ప్రభావితం చేసే తల్లిదండ్రులు, సమాజం, మీడియాను సమర్థవంతంగా నిమగ్నం చేయడానికి వస్తు మానవ వనరులను సమకూర్చడం, వాటిని నిర్వహించడం పాఠశాల నాయకుని బాధ్యత అని ఖచ్చితంగా చెప్పవచ్చు.

# యూనిట్ - 4

# వివిధ లక్షణాలు గల పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలతో పాఠశాల నాయకులు ప్రదర్శించే ఆదర్శ ప్రత్యామ్నాయాలు(Ideation Alternative)

## అభ్యసన లక్ష్యం

అభ్యాసకులు పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాల వివిధ లక్షణాల గురించి తెలుసుకుంటారు. ప్రత్యేక పరిస్థితుల్లో అమలు చేసే విభిన్న ఆదర్శ ప్రత్యామ్నాయాల ప్రభావం, ఫలితాల గురించి అర్థం చేసుకుంటారు.

## కీలక పదాలు




తక్కువ ఆదర్శ ప్రత్యామ్నాయం, ఎక్కువ ఆదర్శ ప్రత్యామ్నాయం


## పరిచయం


వ్యక్తిగత, సామాజిక సమస్యలకు వ్యక్తులు వివిధ ప్రతిచర్యలను ప్రదర్శిస్తారు. ప్రతి పరిస్థితిలోని ప్రతిస్పందనకు ఒక ప్రత్యామ్నాయం ఉంటుంది. ఒక వ్యక్తి ప్రవర్తనకు ప్రతిస్పందించడంలో స్వభావం ముఖ్యపాత్ర పోషిస్తుంది. పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలకు సంబంధించి బహుళ లక్షణాలు ఉన్నాయి. మనందరికీ కొన్ని లక్షణాలు పుట్టుకతోనే వస్తాయి కొన్ని నేర్చుకుని అలవర్చుకోవాలి. ఒక ప్రత్యేక పరిస్థితిలో పాఠశాల నాయకుడి పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాల లక్షణాలు, దాని ప్రత్యామ్నాయ ప్రతిస్పందనలు కింది పట్టికలో ఉన్నాయి. పేలవమైన ప్రతిస్పందన తక్కువ ఆదర్శ ప్రత్యామ్నాయాలను ప్రతిబింబిస్తే సానుకూల ప్రతిస్పందన ఎక్కువ ఆదర్శ ప్రత్యామ్నాయాలను ప్రతిబింబిస్తుంది.


పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలు వివిధ లక్షణాలపై ఆధారపడి ఉంటాయి కనుక ప్రతి ప్రవర్తనాప్రతిస్పందన ఫలితాలు వేరుగా ఉంటాయి. అన్ని లక్షణాలను కలిపి చూసినపుడు ఒక పరిస్థితి ఫలితమేమిటో తెలుస్తుంది.



మన ప్రవర్తనా ప్రతిస్పందన ఫలితాన్ని ఏ విధంగా ప్రభావితం చేస్తుందో కింది పట్టిక చూపిస్తుంది.


| **క్ర.సం.** | **లక్షణం** | **తక్కువ ఆదర్శ ప్రత్యామ్నాయం** | **ఎక్కువ ఆదర్శ ప్రత్యామ్నాయం** |
|---|---|---|---|
| **వ్యక్తింతర నైపుణ్యాలు (Intrapersonal skills)** | | | |
| 1 | ఆత్మవిశ్వాసం   | నా దారిలో వచ్చే సవాళ్ళకు నేను భయపడుతున్నాను. | నా దారిలో ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కోవడానికి నేను సిద్ధంగా ఉన్నాను. |
| 2 | మార్పుకు అనుకూలత   | మారుతున్న పని పరిస్థితులకు అనుకూలంగా మారడానికి నాకు సమయం పడుతుంది. | మారుతున్న పని పరిస్థితుల సానుకూలంగా స్పందిస్తాను. కొత్తవి నేర్చుకోవడానికి, శోధించడానికి సిద్ధంగా ఉంటాను. |
| 3 | టైం మేనేజ్మెంట్   | నా లక్ష్యాలను నిర్దేశించిన సమయం లోపల సాధించడం కష్టంగా ఉంటుంది. | ఇచ్చిన సమయంలోపల లక్ష్యాన్ని సాధించడం కోసం అన్ని వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకొని మంచి ఫలితాలను సాధించడంపై దృష్టిని కేంద్రీకరిస్తాను. |
| 4 | భావోద్వేగ స్థిరత్వం   | వైఫల్యాలను ఎదుర్కోలేను. కష్టకాలంలో భావోద్వేగాలకు లోనవుతాను. | అన్ని పరిస్థితులో స్థిరంగా సంయమనంతో ఉంటాను. కష్టకాలాన్ని తట్టుకొని నిలబడతాను. ఆ సమయంలో కూడా సమర్థంగా పనిచేస్తాను. |
| 5 | పనిలో నైతికత   | అన్ని వేళలా నీతిగా ఉండాలంటే కష్టం | ఒక ఉద్యోగి నుండి ఆశించే నైతిక సూత్రాలు, విలువలను పాటిస్తాను. |

| క్ర.సం. | లక్షణం | తక్కువ ఆదర్శ ప్రత్యామ్నాయం | ఎక్కువ ఆదర్శ ప్రత్యామ్నాయం |
|---|---|---|---|
| 6 | దృఢత్వం<br> | వైఫల్యాల నుండి బయటకు రావడం చాలాకష్టం. సాధారణ స్థితికి రావాలంటే సమయం పడుతుంది. | కష్టతరమైన పరిస్థితుల వైఫల్యాల నుండి త్వరగా తేరుకుంటాను. రెట్టించిన వేగంతో తిరిగి పనిచేస్తాను. |
| 7 | వృత్తిపరమైన స్వీయ అభివృద్ధి<br> | ప్రభుత్వం ఇచ్చే శిక్షణలకు హాజరవుతాను | నా పరిపాలన సమర్థతను గుణాత్మకంగా పెంపొందించుకోవడానికి శిక్షణా కార్యక్రమాలకు హాజరవుతాను. నన్ను నేను అప్డేట్చేసుకుంటాను. |
| 8 | బోధనా నైపుణ్యాలను మెరుగు పరచుకోవడం<br> | బోధనలోని అన్ని సోపానాలను అనుసరిస్తాను. | నన్ను నేను అప్డేట్ చేసుకుంటూ, వినూత్న బోధనా పద్ధతులను తరగతి గదిలో ఉపయోగిస్తాను. |
| **పరస్పర వ్యక్తిత్వ నైపుణ్యాలు (ఒక్కొక్కరితో)** | | | |
| 9 | చురుకుగా వినడం<br> | సంబంధిత విషయాలను మాత్రమే వింటాను | ఎదుటి వ్యక్తి చెప్పేది విని పూర్తి సమాచారం తెలుసుకోవడానికి ప్రయత్నం చేస్తాను. |
| 10 | సహానుభూతితో ఉండడం<br> | పరిస్థితికి అవసరమైన విధంగా ప్రవర్తిస్తాను | తుది నిర్ణయం చేసే ముందు ఎదుటి వ్యక్తి దృష్టి కోణం నుండి ఆలోచిస్తాను. |

| క్ర.సం. | లక్షణం | తక్కువ ఆదర్శ ప్రత్యామ్నాయం | ఎక్కువ ఆదర్శ ప్రత్యామ్నాయం |
|---|---|---|---|
| 11 | భావప్రసారం   | అందరికీ సమాచారం అందిస్తాను | అమౌఖిక హావభావాలను అర్థంచేసుకోవడానికి ప్రయత్నిస్తూ చురుకైన సంభాషణ కొనసాగిస్తాను. |
| | **జట్టు పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలు** | | |
| 12 | నిర్ణయం తీసుకునే నైపుణ్యాలు  | స్వీయ పరిశీలనల ఆధారంగా తుది నిర్ణయం తీసుకుంటాను. | సిబ్బంది, సమాజ పెద్దల నుండి సలహాలను స్వాగతిస్తాను. అందులో నుండి ఉత్తమ ప్రత్యామ్నాయాన్ని ఎంపిక చేసుకుంటాను. |
| 13 | జట్టుపని   | ఫలితం పై దృష్టిపెడతాను | సామాన్య లక్ష్యాన్ని సాధించడానికి జట్టుతో కలిసి పనిచేస్తాను. |
| | ఎ) స్ఫూర్తి   | సాధించవలసిన లక్ష్యాలను నిర్దేశిస్తాను. | ఇతరులలో స్ఫూర్తిని నింపి, స్వీయ అభివృద్ధికి, పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తాను. |
| | బి) విధులను అప్పగించడం   | పనిని అందరికీ సమానంగా పంచుతాను | సిబ్బంది సామర్థ్యాలకు తగినట్టుగా పనులను అప్పగించి, లక్ష్యాన్ని సాధించడానికి జట్టు సభ్యులందరితో పనులు చేయిస్తాను. |
| | సి) జట్టులో ఒకరిగా పనిచేయడం  | లక్ష్యాన్ని సాధించడంలో జట్టు నాయకునిగా పనిచేస్తాను. | జట్టుతో పనిచేస్తూ అవసరమైన చోట నాయకుడిగా లేదా అనుచరుడిగా పని చేస్తాను. |

| క్ర.సం. | లక్షణం | తక్కువ ఆదర్శ ప్రత్యామ్నాయం | ఎక్కువ ఆదర్శ ప్రత్యామ్నాయం |
|---|---|---|---|
| 14 | ఖచ్చితంగా ఉండడం<br> | సూచనలిచ్చి, వాటిని పూర్తి చేయాలని ఆశిస్తాను | ఇతరుల నమ్మకాలను, హక్కులను గౌరవిస్తూనే నేననుకున్నది బలంగా వినిపిస్తాను. |
| 15 | పర్యవేక్షించడం<br> | తుది ఫలితాన్ని సమీక్షిస్తాను | పాఠశాల లక్ష్యాలను ఎంత మేరకు సాధించామని క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తాను. |
| 16 | చర్చలు జరపడం<br> | నాకు నమ్మకం కలగని వాటితో నేను విభేదిస్తాను. | ఇద్దరికీ ఆమోదయోగ్యంగా సమస్యను పరిష్కరించేందు వ్యూహాత్మక చర్చలో పాల్గొంటాను. |
| 17 | సమస్యా పరిష్కారం<br> | సాంప్రదాయ పద్ధతులను పాటిస్తాను | సృజనాత్మకంగా ఆలోచించి వివిధ ప్రత్యామ్నాయాలను కనుగొంటాను. సమస్యా పరిష్కారానికి ఉత్తమ ప్రత్యామ్నాయాన్ని ఎన్నుకుంటాను. |
| | **పబ్లిక్ / మీడియా పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలు** | | |
| 18 | బహిరంగంగా మాట్లాడడం<br> | ఎక్కువ జనం ముందు మాట్లాడడానికి భయపడతాను | తల్లిదండ్రులకు సమాజానికి పాఠశాల లక్ష్యాలను వివరించే ప్రయత్నం చేస్తాను. |
| 19 | సంఘర్షణను సమిసిపోయేటట్లు చేయడం<br> | మెజారిటీ సిద్ధాంతాన్ని పాటిస్తాను | సంఘర్షణను సమసిపోవడానికి హేతుబద్ధమైన, ఆచరణీయమైన పద్ధతిని అనుసరిస్తాను. |

| క్ర.సం. | లక్షణం | తక్కువ ఆదర్శ ప్రత్యామ్నాయం | ఎక్కువ ఆదర్శ ప్రత్యామ్నాయం |
|---|---|---|---|
| 20 | సామాజిక బాధ్యత కలిగి ఉండడం   | అధికారుల మార్గదర్శకాలను పాటిస్తాను | సామాజిక స్పృహ కలిగిస్తాను, సమాజానికి మేలు చేసేలా చూస్తాను. |
| 21 | ఫీడ్ బ్యాక్ ను ఆమోదిస్తాను  | విమర్శలను తట్టుకోలేను. స్వీకరించలేను. | ఫీడ్బ్యాక్ను స్వీకరిస్తాను. దానిపై నిర్మాణాత్మకంగా పనిచేస్తాను. |
| 22 | సమాజ సెంటిమెంట్లను గౌరవించడం  | సెంటిమెంట్లపై ఆధారపడకుండా ఆచరణీయ విధానాన్ని అవలంబిస్తాను. | సమాజ విభిన్నమైన సెంటిమెంట్లను, నమ్మకాలను గౌరవిస్తాను. |
| 23 | సున్నితత్వాన్ని ప్రదర్శించడం   | భావోద్వేగాలను పట్టించుకోను అసలైన అవసరం మీదనే దృష్టి పెడతాను. | సామాజిక లక్ష్యాలు ఇతరుల అవసరాల పట్ల సున్నితత్వాన్ని ప్రదర్శిస్తాను. |
| 24 | సానుకూల దృక్పథం కలిగి ఉండడం  | నా వైఫల్యాల వల్ల నా పని దెబ్బతింటుంది. | వైఫల్యాల సమయంలో కూడా సానుకూలంగా, ఆశావహంగా ఉంటాను. |

| క్ర.సం. | లక్షణం | తక్కువ ఆదర్శ ప్రత్యామ్నాయం | ఎక్కువ ఆదర్శ ప్రత్యామ్నాయం |
|---|---|---|---|
| 25 | ఇతర సంస్కృతులను స్వాగతించడం  | ఎక్కువ మంది పాటించే సంస్కృతిని అనుసరిస్తాను. | ఇతర సంస్కృతులను గౌరవిస్తాను. వాటికి విలువనిస్తాను. |
| 26 | బహుళ సాంస్కృతిక సామర్థ్యాలు, నైపుణ్యాలు సాధించడం  | సమాజం యొక్క సంస్కృతికి కట్టుబడి ఉంటాను. | బహుళ సాంస్కృతిక సామర్థ్యాల, నైపుణ్యాల మార్పిడిని ప్రోత్సహిస్తాను. |
| 27 | సాంస్కృతిక సమూహంలో వైవిధ్యాన్ని గుర్తించడం  | సమాజం యొక్క సంస్కృతిని ప్రశంసించడాన్ని ప్రోత్సహిస్తాను. | సాంస్కృతిక వైవిధ్యాన్ని అవగాహనను వృద్ధి చేస్తాను. విభిన్న సంస్కృతులను ప్రశంసించడాన్ని ప్రోత్సహిస్తాను. |

**సారాంశం**

ఒకవేళ మనం పరస్పర వ్యక్తిత్వ సంబంధాల లక్షణాల పట్ల పేలవంగా ప్రతిస్పందిస్తే, అన్ని లక్షణాల అంశాలు కలిసి తక్కువ ఆదర్శవిలువ ఉన్న ఫలితం వస్తుంది. ఆ ఫలితం ప్రతికూల ప్రభావాన్ని కలిగి ఉంటుంది. అలాగే మనం ఎక్కువ లక్షణాల పట్ల సానుకూలంగా ప్రతిస్పందిస్తే అది మొత్తంగా మనకు ఒక ముఖ్యమైన సానుకూల ప్రవర్తనా ఫలితాన్ని ఇస్తుంది.

# యూనిట్ - 5

# పాఠశాల నాయకులలకు ఉన్నతమైన పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలుంటే పాఠశాలలకు ఏమి ప్రయోజనం కలుగుతుంది?

## అభ్యసన లక్ష్యం

పాఠశాల నాయకులలకున్న పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాల వల్ల పాఠశాలలకు ఎలా ప్రయోజనం కలుగుతుందో అభ్యాసకులు అర్థం చేసుకుంటారు.

## కీలక పదాలు

సంపూర్ణ అభివృద్ధి, పాఠశాల దార్శనికత

## పరిచయం


పాఠశాల నాయకులు ప్రదర్శించే పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలు పాఠశాల లక్ష్యాన్ని సాధించడంలో తోడ్పడతాయి. ఎంతో మంది భాగస్వామ్యులకు లబ్ధి చేకూరుతుంది. విద్యావ్యవస్థలోని అందరు భాగస్వామ్యులతో మంచి వ్యక్తిగత నైపుణ్యాలున్న పాఠశాల నాయకులు చక్కటి సంబంధాలు కలిగి ఉంటారు. సమర్థవంతమైన పాఠశాల పరిపాలనలో మానవ సంబంధాల పరిధిని అది అవలోకిస్తుంది. వివిధ పరిపాలనా పరిస్థితులలో అమలు పరచవలసిన సంబంధాలసాంకేతికతను అది శోధిస్తుంది.

చక్కటి పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలున్న పాఠశాల నాయకులు ఉపాధ్యాయులు ఒత్తిడికి గురయ్యే కారణాలను దూరం చేసే సామర్థ్యం కలిగి ఉంటారు. సమర్థవంతమైన బోధనాభ్యసన ప్రక్రియను నిర్మించే ఉద్దేశ్యంతో ఉంటారు. అలాగే పాఠశాల నాయకుడు తన పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలు ఉపయోగించి పాటించే పరిపాలనా విధానాల వల్ల విద్యార్థులకు కూడా ప్రయోజనం చేకూరుతుంది. పాఠశాలలోని అడ్మిషన్ల సంఖ్య పెంచడం, ఉన్నవారు కొనసాగేలా చూడడం డ్రాపౌట్లను తిరిగి పాఠశాలకు రప్పించడం లాంటి వివిధ సమస్యలను తీరుస్తూనే, ప్రాథమిక నుండి ఉన్నత పాఠశాల విద్యార్థుల అవసరాలను తీర్చడం అనేది పాఠశాల నాయకుని సమర్థవంతమైన పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాల పట్ల ఆధారపడి ఉంటుంది. అలాగే మానవ సంబంధాలను, నాయకత్వపు నైపుణ్యాలను వర్తింపజేస్తూ విద్యార్థుల పెరుగుదల మరియు పాఠశాల అభివృద్ధి రెండింటి యొక్క ఉమ్మడి లక్ష్యాన్ని సాధించడానికి ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రులతో మరియు స్థానిక ప్రజలతో కలిసి పని చేస్తారు.

**నూతన విద్యా విధానం 2020 అనుసారంగా సంపూర్ణ అభివృద్ధి సాధనలో ఒక కటకంగా (lens) పరస్పర వ్యక్తిత్వ నైపుణ్యాలు**

పరస్పర వ్యక్తిత్వసంబంధాలు సమృద్ధిగా ఉండే ప్రదేశం పాఠశాల. విద్యార్థి నుండి సమాజం ఆశించే విద్యా విషయక అభివృద్ధి, మానసిక స్థిరత్వం, సామాజిక సామర్థ్యం లాంటి అన్ని సామర్థ్యాల అభివృద్ధి ఈ సంబంధాల గుణాత్మకతపై ఆధారపడి ఉంటుంది. ఈ కారణం చేతనే పరస్పర వ్యక్తిత్వసంబంధాలు పాఠ్యప్రణాళిక మూలంలో ఉండాలి. పాఠశాలలో బోధనాభ్యసన ప్రక్రియకోసం పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలను పక్కకి పెట్టడం కాకుండా వీటి పునాదిపైనే బోధనాభ్యసన ప్రక్రియ ఉండాలి.

నూతన విద్యావిధానం 2020 ప్రతి వ్యక్తిలో సృజనాత్మక సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడాన్ని ప్రత్యేకంగా నొక్కి వక్కాణిస్తోంది. ఇది జ్ఞానార్జన సామర్థ్యాలు (cognitive skills), అక్షరాస్యత, ఉన్నత స్థాయి ఆలోచనలు, సమస్యా పరిష్కార నైపుణ్యాలతోబాటు సామాజిక, నైతిక, భావోద్వేగ సామర్థ్యాలను కూడా అభివృద్ధి చేయాలనే సూత్రంపై ఆధారపడి ఉంది. వీటన్నింటిని సాధించడం పాఠశాల నాయకుడు చక్కటి పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలు ప్రదర్శించినపుడే సాధ్యపడుతుంది.




విద్యా వ్యవస్థలోని పాఠశాల నాయకుల పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలు విద్యార్థులు, సిబ్బంది, తల్లిదండ్రులు, సమాజం మధ్య సంబంధాల అభివృద్ధికి దోహదపడతాయి. సంబంధాల అభివృద్ధి మనుషులు జట్లలో పనిచేసి ఎక్కువ ఫలితాలను రాబట్టేలా చేస్తుంది. అలాగే జట్లలో పని చేయడం సంస్థ అభివృద్ధికి దారితీస్తుంది. సంస్థ అభివృద్ధి సమాజాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళుతుంది. సమాజం అభివృద్ధి చెందినపుపడు రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. తద్వారా దేశం ప్రగతి బాటలో పయనిస్తుంది.

## సారాంశం

సమాజానికి ప్రయోజనం చేకూర్చేలా పాఠశాల నాయకులు సమర్థవంతంగా నైపుణ్యవంతంగా కావాలంటే వారు పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలను అలవర్చుకోవలసిన అవసరం ఉంది. ముఖ్యంగా పాఠశాల నాయకులు కింద ఇచ్చిన లక్ష్యాలు సాధించే దిశగా కృషి చేయాలి.

- పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలు, వాటి లక్షణాలు, వాటిని పాఠశాల నాయకులు ఎలా ప్రదర్శిస్తారో దృష్టిపెట్టాలి.
- సమర్థవంతమైన నాయకులవ్వాలంటే పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాల అభివృద్ధి అవసరమని గుర్తించి వాటిని అలవర్చుకోవాలి.
- పాఠశాల నాయకుల ఉన్నత పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాల వలన పాఠశాలలకు ఏవిధమైన లబ్ధి చేకూరుకుతుందో గుర్తించాలి.

## ముగింపు

పాఠశాల నాయకుల పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాల వల్ల పాఠశాలలు పొందే ప్రయోజనం గురించి శోధించడమే ఈ మాడ్యూల్ ఉద్దేశ్యం. మానవ సంబంధాల అభివృద్ధి కోసం బహుళ భాగస్వామ్యుల భాగస్వామ్యాన్ని వృద్ధిపరచడంలో మానవ సంబంధాలు ఎంత ముఖ్యమో ఈ మాడ్యూల్ వివరిస్తుంది. వృత్తిలో ఇతరులతో సమర్థవంతంగా మాట్లాడడానికి పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలు ఎలా దోహదం చేస్తాయో మనం చూశాం. అలాగే మంచి పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలు కలిగిన పాఠశాల నాయకులు చక్కటి సామాజిక సంబంధాలను కలిగి ఉండటానికి పిల్లలు, తల్లిదండ్రులు సమాజ పెద్దలతో మాట్లాడి వారి సమస్యలను తీర్చడం ద్వారా పాఠశాలలకు ప్రయోజనం చేకూరుతుందని తెలుసుకున్నాం. దీని వల్ల పిల్లల డ్రాపౌట్ రేట్ తగ్గి, నమోదు శాతం పెరుగుతుంది. వివధ రకాల పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలను ప్రదర్శించి ఒక పాఠశాల నాయకురాలు సమస్యను ఎలా పరిష్కరించిందో మన కేస్ స్టడీలో చూశాం. నేటి పరిస్థితులలో ఏ పాఠశాలలైనా విద్యార్థుల అవసరాలు తీర్చడం, పాఠ్యప్రణాళికను అమలుచేయడం, తరగతి గది నిర్వహణ, సిబ్బంది మధ్య గొడవలు, తల్లిదండ్రులు, సమాజం చేసే డిమాండ్లను తీర్చడం లాంటి సమస్యలతో సతమతమవుతున్నది. వ్యక్తిగత నైపుణ్యాలు మెండుగా ఉన్న పాఠశాల నాయకుడు గొడవలు పెద్దవి కాకుండా చూస్తూపాఠశాల వాతావరణాన్ని ఫలితాలిచ్చే దిశగా మలచగలడు. పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలు లేని పాఠశాల నాయకుల పాఠశాలలు ప్రగతిలో వెనుకబడి ఉంటాయి. ఎక్కువ ఆదర్శ లక్షణాలున్న పాఠశాల నాయకుడి వలన పాఠశాల ఏవిధంగా ప్రయోజనం పొందుతుందో అర్థం చేసుకోవడానికి అభ్యాసకులకు ఈ మాడ్యూల్ తోడ్పడుతుంది.

పరిణామం చెందుతున్న సమాజపు డిమాండ్లను తీర్చడానికి నూతన విద్యావిధానం 2020 చాలా ధృఢ నిశ్చయంతో ఉంది. చక్కటి పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలున్న పాఠశాల నాయకులు ఈ సమస్యలను తీర్చడమే కాక, పాఠశాల నుండి వెలువడే డిమాండ్లను నెరవేర్చే సత్తా కలిగి ఉంటారు.

| | | |
|---|---|---|
| **వ్యక్తిగత నైపుణ్యాలు** | **యూనిట్ – 1**<br>**పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలు వివిధ రూపాలు** | మౌఖిక |
| | | లిఖిత |
| | | అమౌఖిక |
| | | |
| | **యూనిట్ – 2**<br>**పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలు వివిధ స్థాయిలు** | ఇంట్రాపర్సనల్ (తమలో తాము) |
| | | ఇంటర్ పర్సనల్ (పరస్పర వ్యక్తిత్వ) |
| | | జట్టు / బృందం |
| | | పబ్లిక్ / మీడియా |
| | | అంతర్ సాంస్కృతిక |
| | | |
| | **యూనిట్ – 3**<br>**బహుళ భాగస్వామ్యులతో పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలు** | బడి లోపల |
| | | బడి బయట |
| | | |
| | **యూనిట్ – 4**<br>**పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాల లక్షణాలు** | ఎక్కువ ఆదర్శ ప్రత్యామ్నాయం |
| | | తక్కువ ఆదర్శ ప్రత్యామ్నాయం |
| | | |
| | **యూనిట్ – 5**<br>**పాఠశాల నాయకుల పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాల వల్ల పాఠశాలలు ఏవిధంగా ప్రయోజనం పొందుతాయి** | నూతన విద్యావిధానం 2020 అనుసారంగా సంపూర్ణ అభివృద్ధి |

## మదింపు

**కింది ప్రశ్నలకు జవాబులు ఇవ్వండి.**

1. ముఖ కవళికలు, బాడీ లాంగ్వేజ్ ద్వారా భావోద్వేగాలను ప్రదర్శించడం పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాల ________ రూపం
   ఎ) మౌఖిక
   బి) అమౌఖిక
   సి) లిఖిత
   డి) వ్యక్తింతర (ఇంట్రాపర్సనల్-తమతో తాము)

2. ఇతర సంస్కృతుల పట్ల నిష్పక్షపాతంగా ఉండడం ________ కిందికి వస్తుంది.
   ఎ) ఇంట్రాపర్సనల్ (తమతో తాము) నైపుణ్యాలు
   బి) జట్టుపని
   సి) పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలు
   డి) సాంస్కృతిక నైపుణ్యాలు

3. పనులను అప్పగించడం, పర్యవేక్షణ, నిర్ణయాలు తీసుకోవడం వ్యక్తిత్వ నైపుణ్యాలలోని ________ కిందికి వస్తాయి.
   ఎ) జట్టుపని
   బి) పబ్లిక్ వ్యక్తిగత నైపుణ్యాలు
   సి) ఇంట్రాపర్సనల్ (తమతోతాము)
   డి) అంతర్ సాంస్కృతిక నైపుణ్యాలు

4. నేను అన్ని పరిస్థితులలో నిలకడగా, సంయమనంగా ఉంటాను. ఈ వాక్యం ________ పరస్పర వ్యక్తిత్వనైపుణ్యాలను సూచిస్తుంది.
   ఎ) భావప్రసారం
   బి) నిర్ణయం తీసుకోవడం
   సి) భావోద్వేగ స్థిరత్వం
   డి) సంఘర్షణను పరిష్కరించడం

5. ఒక వర్గానికి చెందిన అమ్మాయిల నమోదు చాలా తక్కువగా ఉంది. పాఠశాల నాయకుడు అమ్మాయిలను బడిలో చేర్పించమని ఆ వర్గ సభ్యులను ప్రేరేపించాడు. తద్వారా ఆ బడిలో నమోదు శాతం పెరిగింది. ఇక్కడ పాఠశాల నాయకుడు ప్రదర్శించిన పరస్పర వ్యక్తిత్వనైపుణ్యం ________

ఎ) పట్టుదల

బి) ఖచ్చితంగా ఉండటం

సి) సమయ నిర్వహణ (time management)

డి) సామాజిక బాధ్యతను నిర్వర్తించడం

## రిఫరెన్సులు


1. Kiesler, S. (1978) Interpersonal process in groups and organizations Arlington Heights: AHM Publishing

2. Sarage, W.W. (1986) Interpersonal and Group relations in Educational Administration Glenview, IL. Scott, Foreman.

3. Den, Brak, P. Brekelmans, M&Wubbels, th (2004). Interpersonal teaches behavior and student outcomes school Effectiveness and School Improvement.

4. Openakkes, M. ManlanaR&denBrok P. (2012) Teacher Student interpersonal relations and academic motivation within one school year.

5. Developmental changes and linkage. School effectiveness and school improvement: An international journal of Research, Policy and Practice Kiesles S. (1978) Interpersonal process in groups and Organization. Arlington Heights: AHM Publishing.

6. National Educational Policy 2020, Ministry of HRD, Govt. of India.